సాక్షి
నారాయణపేట
గురువారం, 22, జూన్, 2023



.. ఓటర్ల సవరణ సర్వే
కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఓటేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.
వివరాలు 4లో ▸



పెరిగిన ఉల్లి ధరలు
దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి ధరలు స్వల్పంగా పెరిగాయి.
వివరాలు 4లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /27.4
వాతావరణం
రోజంతా ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. సాయంత్రం చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టిప్పర్‌తో ఇసుక రవాణాకు అవకాశం

నారాయణపేట: ఆన్‌లైన్‌లో మన ఇసుక వాహనం ద్వారా ఇక నుంచి టిప్పర్‌తో ఇసుక రవాణాకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా ఇసుక సరఫరా చాలా విజయవంతం అయ్యిందని, గృహ నిర్మాణం చేసుకుంటున్న వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాగనూరు మండలం వర్కూర్ నుంచి టిప్పర్ లేదా ట్రాక్టర్‌ల ద్వారా ఇసుకను సరఫరా చేసేందుకు జిల్లా ఇసుక కమిటీ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. మన ఇసుక వాహనం ద్వారా తక్కువ సమయంలోనే వినియోగదారులకు ఇసుకను ఇంటికి అందించడంలో విజయవంతమయ్యామని గృహ నిర్మాణాలు చేసుకుంటున్న వారు బుక్ చేసుకున్న రోజునే ఇసుకను అందిస్తున్నామని తెలిపారు. ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్ ద్వారా https://tsmiv.cgg.gov.in/home బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు.

పరస్పర సహకారంతోనే నేర నియంత్రణ

నారాయణపేట రూరల్: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల పోలీసులు ఒకరికొకరు సహకరించుకుంటే నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని ఇరురాష్ట్రాల పోలీసు అధికారులు అభిప్రాయపడ్డారు. బుధవారం యాద్గీర్ జిల్లా సైదాపూర్‌లో జరిగిన ఇరు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశంలో నారాయణపేట జిల్లా నుంచి సీఐ రవిబాబు, మాగనూర్ ఎస్‌ఐ మల్లేష్, రాయిచూర్ జిల్లా శక్తినగర్‌లో జరిగిన సమావేశంలో మక్తల్ సీఐ సీతయ్య, కృష్ణ ఎస్‌ఐ విజయ్‌భాస్కర్, గుర్మిట్కల్‌లో జరిగిన సమావేశంలో దామరగిద్ద ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరిహద్దు ప్రాంతాల్లో జరిగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, అక్రమ రవాణాపై ఒకరికొకరు సహకరించుకోవాలని తీర్మానించామన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య చెక్ పోస్టుల ఏర్పాటు, నదీ పరివాహన ప్రాంతాల్లో వరదల సమయంలో అనుసరించాల్సిన విదానాలు చర్చించినట్లు చెప్పారు. క్రైమ్‌ల విషయంలో తగిన సమాచారాన్ని చేరవేసుకునే విధంగా చూస్తామన్నారు.

ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఈడీ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోను హైదరాబాద్ జోన్ ఈడీ ఏ.పురుషోత్తం బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని వివిధ విభాగాలు, బస్టాండ్, ప్రభుత్వం తీసుకున్న ఆర్టీసీ స్థలాలను పరిశీలించారు. బస్టాండ్‌లో స్టాళ్ల నిర్వహణ, కార్గో లెజిస్టిక్ సేవలపై ఆరా తీశారు. బస్సులను సమయపాలన పాటించేలా రన్నింగ్ సెక్షన్ అధికారులు పర్యవేక్షించాలని, కండీషన్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా గ్యారేజ్ సిబ్బంది సరిచూడాలన్నారు. డిజిల్ టాప్‌అప్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇక రాత్రి ఇక్కడే బసచేసి గురువారం డిపోలోని బస్సుల షెడ్యూల్స్, ఈపీకే, ఓఆర్‌లను పరిశీలించనున్నారు. కార్మికుల సమస్యలను తెలుసుకోనున్నారు. డీఎం ఆంజనేయులు, ఎంఎఫ్ రాజశేఖర్, ఎస్‌టీఐ నజీర్‌షేక్, కార్యాలయ సూపరింటెండెంట్ నరేందర్, సిస్టమ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏడీసీలు ఉన్నారు.



రైతుబంధు అందేనా?





ఈ ఫొటోలో ఉన్న ఈ మహిళా రైతు పేరు మణెమ్మ. ఈమె గత యాసంగికి ముందే 1.20 ఎకరాల భూమిని భర్త పేరు నుంచి తనపేరున విరాసత్ చేయించుకుంది. సదరు మహిళకు పట్టాపాస్ బుక్ సైతం అందింది. ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి సాయం కోసం అందించే రైతుబంధు కోసం కావాల్సిన ధ్రువీకరణ పత్రాలతో వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం నుంచి నేరుగా బ్యాంకు ఖాతాలోనే పెట్టుబడి సహాయం జమ చేస్తారని అధికారులు చెప్పడంతో ఎదురు చూసింది. వానాకాలం సీజన్ మొదలై ప్రభుత్వం వానాకాలం పెట్టుబడి సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేటికీ సదరు మహిళా రైతుకు రైతుబంధు సహాయం అందలేదు. ఇది ఒక్క మణెమ్మ సమస్యనే కాదు. జిల్లాలో మొత్తం 2వేల మంది రైతుల పరిస్థితి.

జిల్లాలో కొత్త రైతుల ఎదురుచూపులు
- యాసంగిలో రెండువేల మందికి అందని ప్రభుత్వ సాయం
- ఈనెల 26 నుంచి వానాకాలం రైతుబంధు పంపిణీ

కోస్గి: ప్రభుత్వం యేటా యాసంగి, వానాకాలం పంటల సాగు కోసం రైతులకు పెట్టుబడి సాయంగా ఒక్కో పంటకు ఎకరానికి రూ.5వేల చొప్పున అందజేస్తుంది. గతంలో భూముల క్రయవిక్రయాలు జరిపి కొత్త పట్టాపాస్ బుక్కులు రాగానే రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సహాయం జమ చేసేవారు. యాసంగి కాలానికి సంబంధించి పూర్తిస్థాయిలో రైతులకు పెట్టుబడి సహాయం అందలేదు. జిల్లాలో రెండువేల మంది రైతులకు సహాయం అందాల్సి ఉంది. కొత్త రైతులకు గత యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు అందకపోవడంతో వానాకాలంలోనైనా పెట్టుబడి సహాయం అందుతుందా..? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సాయం 1.61లక్షల మందికే..



యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 13 మండలాల పరిధిలో మొత్తం 1.63 లక్షల మంది అర్హులైన రైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. అధికారుల లెక్కల ప్రకారం రూ.220.09 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉండగా, 206.37 కోట్లు మాత్రమే జమ చేశారు. మరో రెండువేల మంది కొత్త రైతులకు సంబంధించి సుమారు రూ.14 కోట్లు నేటికీ అందకపోవడంతో బాధిత రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఆలస్యమైనా వందశాతం యాసంగి సీజన్ పెట్టుబడి అందుతుందని ఎదురుచూస్తున్నారు. కానీ ప్రభుత్వం తాజాగా వానాకాలం పంట సహాయం అందించేందుకు సిద్ధం కావడంతో కొత్త రైతులు నిరాశ చెందుతున్నారు. వానాకాలంలోనైనా తమకు పెట్టుబడి సహాయం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం..



ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుబంధు పెట్టుబడి సహాయం కోసం రైతుల భూముల వివరాలు రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేస్తాం. యాసంగిలో వివరాలు అందించిన రైతుల పేర్లు నమోదు చేశాం. దీంతో నేరుగా రైతుల ఖాతాల్లోనే నిధులు జమఅవుతాయి. తాజాగా నమోదైన రైతుల వివరాలు వానాకాలం రైతుబంధు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఇంకా ఎవరైనా కొత్త రైతులు ఉంటే నమోదు చేసుకోవచ్చు.

– జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాలో యాసంగి రైతుబంధు వివరాలు..

మండలం	మొత్తం రైతులు	సాయం అందిన రైతులు	చెల్లించిన సాయం
నారాయణపేట	18232	18095	19.62 కోట్లు
కోస్గి	17654	17430	19.11
మక్తల్	20602	20246	29.72
మద్దూర్	20786	20068	22.05
కృష్ణా	8143	7871	13.73
మాగనూర్	9156	8990	14.73
నర్వ	12471	12282	18.34
ఊట్కూర్	17486	17247	24.75
దామరగిద్ద	16552	16397	18.91
ధన్వాడ	10008	9925	10.63
మరికల్	12357	12220	14.74

ఆయిల్‌పాం సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నర్వ: జిల్లాకు కేటాయించిన 6,600 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. బుధవారం నర్వ రైతువేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఆరు మండలాల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగులో ఈనెలాఖరు వరకు టార్గెట్‌ను పూర్తిచేయకపోతే చర్యలు తప్పవన్నారు. నర్వ మండలంలో వెయ్యి ఎకరాలు, మక్తల్ 1300 ఎకరాలు, కృష్ణా 600 ఎకరాలు, మాగనూర్ 450 ఎకరాలు, ఊట్కూర్ 400 ఎకరాలు, మరికల్ 500 ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు వల్ల రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. రైతులకు సాగు వైపు మళ్లించేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పంట మార్పిడి, మార్కెట్ చేసుకునే విధానం, అంతరపంటల సాగుపై అవగాహన కల్పిస్తే రైతులు ముందుకు వస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్, ఉద్యానశాఖ అధికారి కస్తూరి వెంకటేశ్వర్లు, ఆయా మండలాల ఏఓ, ఏఈఓలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదు త్వరగా పూర్తి చేయాలి

నారాయణపేట: కొత్త ఓటర్లను చేర్చే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జనరల్ ఎలక్షన్ ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 550 పోలింగ్ స్టేషన్లలో ఉన్నాయని వాటిలో అర్బన్ 82, రూరల్ 468 ఉన్నాయన్నారు. కొత్తగా ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టిన వాటికి ఎపిక్ కార్డులు ఓటర్లకు అందజేయాలన్నారు. జిల్లాలో 16 మంది నోడల్ అధికారులు, 550 మంది బీఎల్‌ఓలు, 55 మంది సూపర్‌వైజర్లు ఉన్నారన్నారు. ఫామ్ 6,7,8 ద్వారా నమోదు చేసిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించే రెండు రోజుల్లో పూర్తి జాబితా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, ఏఓ నర్సింగ్ రావు, సూపరింటెండెంట్ జగదీశ్, తహసీల్దార్ దానయ్య, డీటీలు రాణి, వాసుదేవరావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో వినూత్న ఒరవడి తీసుకొస్తాం



మాట్లాడుతున్న పీఏసీఎస్ నూతన చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నర్వ: మండల పీఏసీఎస్‌లో నూతన పాలకవర్గం సహకారంతో వినూత్న ఒరవడి తీసుకొస్తామని చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం చైర్మన్ ఎన్నిక కోసం డీసీఓ నోటిఫికేషన్ ఇవ్వగా 11మంది డైరెక్టర్‌లు చేతులెత్తి చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డిని ప్రతిపాదించారు. అనంతరం చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు డీసీఓ ప్రకటిస్తూ.. ఎన్నిక ధ్రువపత్రం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకవర్గంలో చైర్మన్ ఒంటెద్దు పోకడలతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పాలకవర్గం మనోభావాలను దెబ్బతీయడంతో మూకుమ్మడిగా చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి దించామన్నారు. కొత్త పాలకవర్గంతో ఉన్న ఏడాదిన్నర కాలంలో ఒక కొత్త అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రైతుల ట్రాన్స్‌పోర్ట్ డబ్బులు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గోదాము నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో గోదాము నిర్మాణం చేపట్టే ప్రసక్తే లేదన్నారు. ఆ స్థానంలో ఎమ్మెల్యే సహకారంతో రైస్‌మిల్లు ఏర్పాటు చేసుకునేందుకు పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను రైతులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్ ఎంపీపీ వీణావతి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, డైరెక్టర్‌లు, నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



బస్టాండ్‌లో సీసీ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

కోస్గి: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలుఅభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పూర్తి చేసిన సీసీ నిర్మాణ పనులు, ఎంపీడీఓ కార్యాలయం ముందుగా పూర్తి చేసిన సీసీ పనులు పరిశీలించారు. గ్రంథాలయ భవన నిర్మాణ పనులను, డ్రెయినేజీ నిర్మాణ పనులను సైతం పరిశీలించారు. పట్టణ శివారులో చెన్నారం రోడ్డులో నూతన వెంచర్‌ను నిబంధనల మేరకు అభివృద్ధి చేయకపోవడంతో గతంలో పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పనులు పూర్తి చేయడంతో మరోమారు వెంచర్‌ను పరిశీలించారు. బీసీ కాలనీ సమీపంలో టెన్నిస్ కోర్టు నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం సరిపోదని టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేయగా స్థలాన్ని పరిశీలించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష, కమిషనర్ శశిధర్, టీపీఓ కిరణ్, మున్సిపల్ ఏఈ విలోక్, పబ్లిక్ హెల్త్ ఏఈ జ్ఞానేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బల్‌రాంతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఖవ్వాలిలో పాల్గొన్న ఎమ్మెల్యే

నారాయణపేట రూరల్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మండలంలోని కొల్లంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. హజ్రద్ హుస్సేని దర్గాలో మతపెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన ఖవ్వాలిలో పాల్గొన్నారు.

జింకలను తరలించాలని ధర్నా

నారాయణపేట: అడవి జింకలతో పంటలు నష్టపోతున్నామని, వెంటనే వాటిని తరలించాలని కోరుతూ బుధవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్ద భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం అటవీశాఖ అధికారి నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎస్ నాయకులు మాట్లాడుతూ విత్తనాలు విత్తినప్పటి నుంచి పంట చేతి కొచ్చే వరకు జింకల దాడి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్, అనంతర్‌రెడ్డి, రంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలప్ప, శ్రీను, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

సేవలు విస్తరిస్తున్న ఆర్టీసీ

- జిల్లాలో గ్రామ బస్ ఆఫీసర్ల నియామకం
- ప్రజల్లో అవగాహన పెంచేందుకు వినూత్న కార్యక్రమం

నారాయణపేట రూరల్: ఆర్టీసీ లాభాల బాట పట్టించడానికి ఆ సంస్థ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. తాజాగా గ్రామాలకు బస్ అధికారుల (విలేజ్ బస్ ఆఫీసర్స్)ను నియమించింది. జిల్లాలో నారాయణపేట, కోస్గి డిపోలో ఉన్నాయి. 49 పల్లెవెలుగు, 42 ఎక్స్‌ప్రెస్, ఒక డీలక్స్, ఒక సూపర్‌లెగ్జరీ సర్వీసులను ఏర్పాటు చేశారు. వీటిలో 44 సంస్థకు చెందినవి ఉండగా, 49 అద్దె బస్సులు ఉన్నాయి. డిపోలో 205మంది కండక్టర్లు, 105మంది డ్రైవర్లు విధులు నిర్వహిస్తుండగా, 32 రూట్లలో 92 షెడ్యూల్స్ ఏర్పాటు చేసి ప్రతిరోజు 36,012 కిలోమీటర్ల మేర బస్సులు తిరిగి సరాసరి రూ.15.5లక్షల ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలతో పాటు మరో వందవరకు శివారు గ్రామాలు ఉన్నాయి. దాదాపు 59 గ్రామాలు, 74 తండాలకు బస్సులు నడవటంలేదని అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

17మంది వీబీఓల నియామకం..

జిల్లాలోని మేజర్, పెద్ద గ్రామ పంచాయతీలలో మొదటి విడతగా 54 ఎంపిక చేశారు. దీనికిగాను అత్యుత్తమ ఈపీకే తీసుకొచ్చిన 17మందిని విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమించారు. ఒక్కొక్కరికీ 3 నుంచి 5 గ్రామాలను అప్పగించారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారు నిర్వహించాల్సిన విధులను తెలియజేశారు. ప్రత్యేకంగా ముద్రించిన టీషర్టులు, ఐడీకార్డు, బ్యాగులు, ప్రజలకు చెప్పాల్సిన విషయాలకు సంబంధించిన పుస్తకాలు అందజేశారు. వీరికి అప్పగించిన గ్రామపంచాయతీల నోటీస్ బోర్డుల్లో వీబీఓల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లను పొందుపర్చాలని సూచించారు.



వీబీఓలకు సామగ్రి పంపిణీ చేస్తున్న ఆర్టీసీ డీఎం, ఆర్టీఓ (ఫైల్)

విధులు ఇలా..

ప్రతి 15 రోజులకు ఒకసారి వారికి కేటాయించిన గ్రామాల్లో వీబీఓలు పర్యటించి ప్రజాప్రతినిధులు, జీపీ అధికారులతో కలిసి ప్రజలను సమావేశ పర్చాలి. గ్రామ రవాణా సౌకర్యాలపై సమస్యలను తెలుసుకుని వారి ఫిర్యాదులు రిజిస్టర్‌లో నమోదు చేసి డీఎంకు తెలియచేయాలి. అద్దె వాహనాల్లో తిరగకుండా ప్రయాణికులను చైతన్య పర్చాలి. బస్సుల రాకపోకల పట్టిక గ్రామాల్లో ప్రదర్శించాలి. కొత్త రూట్లు, అదనపు సర్వీసులపై అధ్యయనం చేసి సలహాలు ఇవ్వాలి. గ్రామాల్లో జరిగే శుభకార్యాల తేదీలను గుర్తించి, వారిని కలిసి బస్సుల బుకింగ్‌కు సంప్రదించాలి. ఆర్టీసీ పథకాలు, సేవలను గ్రామస్తులకు తెలియజేయాలి.

ప్రజలకు చేరువ చేస్తాం..



ఆర్టీసీ సంస్థను ప్రజలకు చేరువ చేసి వారికి తగినట్లు, అందరి అవసరాలకు అనుగుణంగా బస్సులను నడిపించేందుకు ఉద్యోగులుగా మా వంతు సహకారం అందిస్తాం. వీబీఓలుగా గ్రామాల్లో తిరిగి సమస్యలను గుర్తించి, సలహాలు స్వీకరించి పైఅధికారులకు నివేదిస్తాం.

– పకీరప్ప, వీబీఓ, నారాయణపేట

సంస్థ అభివృద్ధికి ఉపయోగం..

ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ల నియామకం ఆర్టీసీకి ఎంతో ఉపయోగం. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుంది. సలహాలు, ఫిర్యాదులు స్వీకరించడం వల్ల లోటుపాట్లను సరిచేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే వీబీఓలకు సామాగ్రి అందించాం. గ్రామాల్లో పర్యటిస్తూ సంస్థ సేవలను ప్రజలకు తెలియజేస్తున్నారు.

– ఆంజనేయులు, డిపో మేనేజర్

ఘనంగా యోగా దినోత్సవం

నారాయణపేట రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో వేర్వేరు చోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆసనాలు వేశారు. చిన్నారులు, మహిళలు యోగా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మానసిక ప్రశాంతత, శారీరక ఆనందం పొందుతామన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారత్ నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగురావు నామాజి, గందె చంద్రకాంత్, రతంగపాండురెడ్డి, డీవైఎస్ఓ కృష్ణమాచారి, సివిల్‌సప్లై అధికారి శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ జయచంద్రమోహన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌లో..

స్థానిక కోర్టు ఆవరణలో యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ యోగాను ప్రపంచానికి భారతదేశం పరిచయం చేసిందని, యోగాతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎన్నో రకాల రోగాలను నయం చేసుకోవచ్చని, రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీనివాస్, మహ్మద్ ఉమర్, సయ్యద్ జాకీర్ సుల్తానా, బార్‌అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ వెంకటేశ్వర్లు, యోగాసనాలు వేస్తున్న చిన్నారులు



పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆసనాలు వేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకోగా, బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. నాగనూలు చెందిన తుమ్మల నిరంజన్ (53) స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకుని చెరువులో పడి మృతిచెందాడు. మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

కల్వకుర్తి టౌన్: నీటి సంపులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన అంజద్ ఖాన్ (32) మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటుకు వెళ్లి తిరిగి రాలేదు. ఉదయమైన ఇంటికి రాకపోవటంతో అతని మిత్రులను కుటుంబసభ్యులు ఆరాతీశారు. వారి ఇంటికి కొద్ది సమీపంలో ఉన్న మిత్రుడు ఖలీల్ ఇంటి నీటి సంపులో మృతి చెంది కనిపించాడు. కుటుంబసభ్యులు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా, ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. సోదరుని మృతిపై అనుమానాలున్నాయని రఫిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన బండారు వెంకటయ్య(42) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండా రు వెంకటయ్య పది రోజుల క్రితం తన ఇంటి వెనకాల ఉన్న వేపచెట్టుకు కరెంట్ తీగలు అడ్డు గా ఉన్నాయని, కొమ్మలను నరికేసే క్రమంలో మూర్ఛ వచ్చి చెట్టుపై నుంచి పడిపోయాడు. చూసిన కుమారుడు నరేష్, తమ్ముడు రాములు వెంటనే వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. చిక్సిత పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. భార్య అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ శ్రీనివాసులు తెలిపారు.

రెండు బైకులు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

శాంతినగర్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ట్రాక్టర్ మెకానిక్‌కు తీవ్ర గాయాలైన సంఘటన వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ స్టేజి సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తనగలకు చెందిన ట్రాక్టర్ మెకానిక్ మోహన్‌రెడ్డి శాంతినగర్‌లో తన గ్యారేజీకి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి బయలుదేరాడు. ఈ క్రమంలో జూలెకల్ స్టేజి సమీపంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న వ్యక్తి అతివేగంతో మోహన్‌రెడ్డి బైక్‌ను ఢీకొన్నాడు. సంఘటనలో ఇరువురు కిందపడిపోగా మోహన్‌రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష

నర్వ: యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తికి నారాయణపేట జిల్లా కోర్టు జడ్జి రఫీ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. ఎస్‌ఐ విక్రమ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాతర్చేడ్ చెందిన ఎల్.ఆనంద్ ఓ యువతిని 2019లో ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఆపై పెళ్లి చేసుకోవాలని యువతి పలుమార్లు కోరిన ఆనంద్ నిరాకరించాడు. దీంతో ఆమె మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ నవీద్ కేసు నమోదు చేయగా దీనిపై మరికల్ సీఐ శివకుమార్ చార్జిషీట్ దాఖలు చేశారు. అడిషనల్ పీపీ మురళీకృష్ణ ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టి వాదన వినిపించగా జిల్లా జడ్జీ పదేళ్ల జైలుశిక్ష, రూ.55 వేల జరిమానా విధించారు.

విద్యుత్‌చౌర్యం కేసులో వ్యక్తి రిమాండ్

అయిజ: మండలంలోని రాజాపురం చెందిన తెలుగు పెద్ద రంగన్న తన ఇంటికి అనుమతి లేకుండా విద్యుత్ వాడుకుంటున్నాడు. విద్యుత్‌శాఖ అధికారులు గతంలో తనిఖీ నిర్వహించి మొదటి తప్పుగా భావించి అతనికి జరిమానా విధించారు. తిరిగి రెండవసారి అనుమతి లేకుండా వాడుకుంటుండగా విద్యుత్‌శాఖ ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి అతనిపై కేసు నమోదుచేశారు. మహబూబ్‌నగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా రంగన్నపై కేసు నమోదు చేశారు. గద్వాలలోని ఫస్ట్ అడిషనల్ అండ్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించి, మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీస్‌స్టేషన్ సీఐ రవీందర్‌రెడ్డి, ఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

ఇంటింటా ఓటర్ల సవరణ సర్వే



మహబూబ్‌నగర్ వివేకానందనగర్‌లో ఓటరు సర్వే తీరును పరిశీలిస్తున్న ఆర్డీఓ అనిల్‌కుమార్

- ఒకే బూత్‌లో కుటుంబ ఓట్లు
- పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు
- ఈనెల 23 వరకు అవకాశం

మహబూబ్‌నగర్ రూరల్: ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లంతా.. ఒకే పోలింగ్ బూత్‌లో ఓటేసేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం ఈనెల 23వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిన అంశాల ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

కార్యకర్తల సహకారం అవసరం..

పలు పార్టీల బూత్‌స్థాయి కార్యకర్తలు పురపాలికల్లో సహకరించాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. ప్రస్తుతం ఏ పార్టీ కార్యకర్తలు సహకరించడం లేదని, జిల్లా అధ్యక్షులు చొరవ తీసుకొని తమ కార్యకర్తలకు సూచనలు చేయాలని పేర్కొంటున్నారు. కుటుంబం మొత్తం ఒక పోలింగ్ బూత్‌లో ఓట్లు ఉండేలా చూడాలని చెబుతున్నారు. ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాత నాయకులు వచ్చి వాగ్వివాదానికి దిగే బదులు ప్రస్తుతం బీఎల్‌ఓలకు బూత్‌స్థాయి కార్యకర్తలు సహకరిస్తే ఓట్ల గల్లంతు ఉండదని అధికారులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో మునుపటి కన్నా ఓటర్ల సంఖ్య పెంచాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. హేతుబద్ధీకరణ ద్వారా ఒకే ఇంట్లోని వారు ఓటేసేందుకు వేర్వేరు చోట్లకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని ఎన్నికల సంఘం సూచించింది. ఇక నుంచి ప్రతి కేంద్రం పరిధిలో 1,500 మంది ఓటర్లు ఉండేలా చూడాలన్న కసరత్తుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో పట్టణాల్లో 1,200 మంది ఓటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 1,400 మంది ఓటర్లు ఉండేవారు. అంతకు మించితే ఆయా కేంద్రాల పరిధిలో అనుబంధ కేంద్రం ఏర్పాటు చేసేవారు. పోలింగ్ కేంద్రాలను పకడ్బందీగా జియోగ్రాఫికల్ మ్యాపింగ్ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఆ మ్యాపింగ్ చేసే సమయంలో ఇంటి నంబర్లనూ పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు.

ఇంటి నంబర్ జోడించేందుకు అవకాశం

పట్టణాల్లో బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వేర్వేరు కుటుంబాల ఓటర్లు ఒకే ఇంటి నంబరుపై నమోదవుతున్నారు. అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ నంబరును అదనంగా జోడించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. ఓటర్లు ఈ విషయం గుర్తించి ప్లాట్ నంబరు, ఇంటి నంబరును నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఓటర్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆర్డీఓ అనిల్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణంలో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న సర్వే తీరును బుధవారం పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లో ఇంటింటి సర్వేలో బీఎల్‌ఓలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	272	2,29,760
జడ్చర్ల	274	2,02,404
దేవరకద్ర	285	2,15,220
నాగర్‌కర్నూల్	259	2,11288
అచ్చంపేట	265	2,17,956
కొల్లాపూర్	268	2,14,594
కల్వకుర్తి	262	2,17,042
నారాయణపేట	270	2,13,330
మక్తల్	280	2,21470
వనపర్తి	290	2,46,511
గద్వాల	303	2,34,633
అలంపూర్	289	2,22,468

అక్టోబర్ 5న తుది జాబితా

ఓటరుగా నమోదైన వ్యక్తి ఇంటి నంబర్ తప్పకుండా ప్రస్తావించాలి. కుటుంబ సభ్యులంతా ఒకే ఇంటి నంబర్ ఇస్తే వారంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా అధికారులు జాబితా సిద్ధం చేస్తారు. గతంలో నలుగురు సభ్యుల్లో ఇద్దరు ఒకచోట, మరో ఇద్దరు వేరే చోట నమోదయ్యారు. దీంతో చాలా మంది ఓటు వేసేందుకు విముఖత చూపించారు. పోలింగ్ శాతం పెంచేందుకు కుటుంబ సభ్యులందరినీ ఒకే కేంద్రం పరిధిలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 23వ తేదీ వరకు సవరణలకు అవకాశం ఉంది. కొత్త పేర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇల్లు మారినా, ఇంటి నంబర్లు జోడింపు, అక్షర దోషాలు, ఇలా సవరణలకు అవకాశం ఉంది. అక్టోబర్ 5న తుది జాబితా ప్రకటిస్తారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం..



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సవరణ సర్వే చేపట్టాలి. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న వారి వివరాలు సరైంది లేదా అనే విషయాలు పక్కాగా తెలుసుకోవాలి. కమిషన్ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలి.

– బి.పార్థసారథి, తహసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్

ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ అమలేది?



మాట్లాడుతున్న నిఖిల్ ఆనంద్

- కేంద్ర పథకాలను కనుమరుగు చేసే కుట్రకు సీఎం తెర
- బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి నిఖిల్‌ఆనంద్

వనపర్తిటౌన్: పేదలకు ఆరోగ్య శ్రీ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ స్కీం కింద వైద్యసేవలు అందించేందుకు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఏ మాత్రం చొరవ చూపడంలేదని ఓబీసీ మోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి నిఖిల్ ఆనంద్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నియోజకవర్గ బీజేపీ నాయకుల సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిఖిల్ ఆనంద్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థను పెంచిపోషిస్తుందని దుయ్యబట్టారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.వేలకోట్ల బకాయిలు చెల్లించడం లేదని, ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలో అమలు చేస్తే కేసీఆర్ సర్కార్‌కు నయా పైసా ఖర్చు ఉండదన్నారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకొస్తే, రాష్ట్ర వాటాను సీఎం కేసీఆర్ విడుదల చేయకపోవడంతో పంట నష్టపోయిన రైతుల ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమని నిప్పులు చెరిగారు. దేశంలో కేసీఆర్ పార్టీ విస్తరణకు, ప్రచారానికి రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, మన ఊరు –మన బడి పథకానికి మాత్రం ఎన్నారై, దాతల విరాళాలతో బడులను బాగు చేస్తున్నారని చెప్పారు. ప్రచారానికి ఖర్చు చేసిన దాంట్లో ఒక్క పాఠశాలకు రూ.కోటి కేటాయిస్తే ప్రతి పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి విద్యను అందిచవచ్చని, కేసీఆర్‌కు రాష్ట్రంలోని పేదలు విద్యలో రాణించడం ఇష్టం లేకే నిధులు కేటాయించడం లేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని ర్టీని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, ప్రతాప్, రాజవర్ధన్‌రెడ్డి, రవీందర్, కృష్ణ, కృష్ణయ్య, శ్రీశైలం, జ్యోతి, రమణ, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా సంఘ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యావ్యవస్థపై పూర్తిగా నిర్లక్ష్య ధోరణి నెలకొందని, ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను అన్ని పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు తెలియచెప్పి చైతన్య పరచాలన్నారు. ప్రభుత్వరంగ విద్యా సంస్థలపై సవితితల్లి ప్రేమను చూయిస్తూ కార్పొరేట్ వ్యవస్థను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటు నుంచి విద్యారంగానికి ఏమి చేశారో చెప్పి సంబరాలు చేసుకోవాలని విమర్శించారు. హేతుబద్దీకరణ పేరుతో చాలా పాఠశాలలను మూసివేశారని, కొత్త నియామకాలు చేపట్టకుండా ఖాళీల స్థానంలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో టీచర్లపై భారం మోపుతున్నారని ఆరోపించారు. మెరుగైన విద్యకు బీద, మధ్య తరగతి విద్యార్థులను దూరం చేసి కేవలం ధనికులే రాబోవు రోజుల్లో బాగుపడే విధంగా ముందుకుపోతున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దాదాపు రూ.4,500కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో సాయికుమార్, అజయ్, హన్మంతు, శ్రీహరి, గౌస్, విజయ్, మల్లేష్, కురుమూర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధరలు



దేవరకద్ర మార్కెట్‌లో తూకం వేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్న ఉల్లి బస్తాలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన వేలంలో ఉల్లి ధరలు స్వల్పంగా పెరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సీజన్ ప్రారంభం కాగా 5నెలలుగా ధరలు రూ.వెయ్యికి అటు ఇటుగానే నమోదయ్యాయి. ప్రస్తుతం ఉల్లి సీజన్ ముగుస్తున్న సమయంలో స్వల్పంగా ధరలు పెరిగాయి. మార్కెట్‌లో వారానికి ఒక సారి నిర్వహించే బహిరంగ వేలం బుధవారం ఉదయం 10గంటలకు ప్రారంభించారు. రైతులు వెయ్యి బస్తాల వరకు ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. ధర గరిష్ఠంగా రూ.1,410, కనిష్ఠంగా రూ.900 పలికింది. సీజన్ మొత్తం ప్రస్తుతం రూ. 200 వరకు గరిష్ఠ ధర పెరగడంతో రైతులు ఆనందించారు. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా ఎక్కువగా రూ.700, తక్కువగా రూ.500 వరకు విక్రయించారు. మార్కెట్‌లో విక్రయించని రైతులు నేరుగా వినియోగదారులకు అమ్ముకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మార్కెట్‌లో, మార్కెట్ బయట ఉల్లి వ్యాపారం పోటా పోటీగా సాగింది.

పెరిగిన కందులు, హంస ధర

మార్కెట్‌లో బుధవారం నిర్వహించిన ఈనామ్ టెండర్లలో కందులు, హంస ధాన్యం ధరలు బాగా పెరిగాయి. కందుల క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9వేల వరకు నమోదైంది. హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,300, కనిష్ఠంగా రూ. 1,700 వరకు ధరలు పలికాయి.

వ్యవసాయంలో సమాచారలోపాన్ని అధిగమించాలి

- కేంద్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ జేపీ యాదవ్



రైతులతో చర్చిస్తున్న కేంద్ర బృందం

బిజినేపల్లి: మనది ప్రధానంగా వ్యవసాయాధార దేశమని, వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో సమాచారలోపం తీవ్రంగా ఉందని కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ డైరెక్టర్ జేపీ.యాదవ్ అన్నారు. బుధవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలోని రైతువేదికలో నేషనల్ డిజిటల్ ఎక్స్‌టెన్షన్ టీం వారు రాష్ట్ర, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో వ్యవసాయ సమాచారంపై రైతులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల నుంచి వచ్చే సమాచారాన్ని వ్యవసాయేతర రంగాలు సద్వినియోగం చేసుకున్నప్పటికీ, వ్యవసాయంలో మాత్రం క్షేత్రస్థాయిలో సమాచారలోపం ఉందని, దానిని అధిగమించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయంలో సాగు చేసే పంటలు, వాటి చీడపీడల నివారణ, ప్రభుత్వాల నుంచి అందే పథకాల సమాచారం మరింతగా చేరాలని, అందుకు గల మార్గాలను అన్వేషించాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. రైతులు కూడా తమకు కావాల్సిన సమాచారం ఏ విధంగా తమకు అందాలో ఆయన సూచించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా అందే సమాచారం గురించి అధికారులు అడిగి తెలుసుకున్నారు. పంటల సాగుకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు ఏ విధంగా చేరవేస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక రైతులకు సంబంధించిన సంక్షిప్త సమాచారం రైతులకు అందేలా ప్రత్యేకంగా యాప్‌ను త్వరలోనే రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, కమిషనరేట్ జేడీఏ సుజాత, డీడీఏ శైలజ, ఏడీఏ శివానంద్, డీఏఓ వెంకటేశ్వర్లు, ఏడీఏ రమేష్‌బాబు, ఏఓ కమల్‌కుమార్, ఏఈఓలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతిలో ప్రవేశాలకై నిర్వహించిన పరీక్షా ఫలితాలు బుధవారం సాయంత్రం వెలువడినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు https://cbseit.in/cbse/2023/nvsresult/Result.aspx వైబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. నవోదయకు ఎంపికైన విద్యార్థులకు ఫోన్, పోస్టు ద్వారా సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.

గ్రామ క్షేమం కోసం ఒకరోజు అడవికి



మహబూబ్‌నగర్ రూరల్: గ్రామానికి సకల శుభాలు చేకూరాలని ఆకాంక్షిస్తూ మండలంలోని మాచన్‌పల్లి ప్రజలు బుధవారం గంప జాతర వెళ్లారు. ఈ సందర్భంగా వారు గ్రామ పరిసరాల్లోని వ్యవసాయ పొలాల్లో సకుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకొని విందు భోజనాలు చేసి సాయంత్రం వరకు అడవిలోనే సేద తీరారు. కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆనవాయితీగా ప్రతి సంవత్సరం నిర్వహించి నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నరసయ్య, వెంకటయ్య, లింగయ్య, మొగులయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 808.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 808.7 అడుగుల నీటిమట్టం, 33.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్థానికంగా 11.20 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రజాధనం దిగమింగడానికే ఉత్సవాలు




మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతుంటే.. పదేళ్ల పండుగ చేస్తున్న బీఆర్‌ఎస్ సర్కార్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలకేరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలలో అన్ని వర్గాల ప్రజలు ఎక్కడా అని ప్రశ్నించారు. ప్రజాధనం దిగమింగడానికే ఉత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులు కట్టిందే కమీషన్ల కోసమేనని, రాష్ట్రంలో అత్యంత అవినీతి రంగం ఏదైన ఉందంటే, అది ఇరిగేషన్ అని తెలిపారు. బూత్ స్థాయి లీడర్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు ప్రతి ఒక్కరూ అవినీతిలో భాగమేనన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట మరో అవినీతికి శ్రీకారం చుట్టారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిపై విచార చేసి జైలుకు పంపుతామన్నారు. సేవ చేసే నియోజకవర్గం సీఈఓకు 2014లో రూ.111 కోట్లు ఉంటే 2018లో రూ.161 కోట్ల సంపద ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. కడిగిన ముత్యానివే అయితే ఐటీ శాఖ ఎందుకు నోటీసులు ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బినామీల పేరుపై ఉన్న ఆస్తులు కూడబెట్టుకు, పునీతుడిలా మాట్లాడుతున్నాడని ఎద్దేవ చేశారు. వచ్చే ఎన్నికల్లో మర్రి అడ్రస్ గల్లంతేనని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే తొమ్మిదేళ్లలో ఏం చేశాడో చెప్పాలన్నారు. అక్కరకు రాని దశాబ్ది ఉత్సవాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసనలు తెలుపుతామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ డీఎంఈఓ మృతి

- పాండిచ్చేరి వెళ్తుండగా ఘటన



వేణుగోపాల్‌రెడ్డి(ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కొల్లాపూర్/ మహబూబ్‌నగర్ క్రైం: మండలంలోని మాచినేనిపల్లికి చెందిన గాదెల వేణుగోపాల్‌రెడ్డి(58) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వేణుగోపాల్‌రెడ్డి భార్య, ఇద్దరు కుమారులతో కలిసి తిరుపతి దర్శనానికి వెళ్లారు. అటునుంచి పాండిచ్చేరి వెళ్తుండగా మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భార్య, పెద్దకుమారుడు క్షేమంగా ఉండగా, చిన్నకుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని అక్కడే ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వేణుగోపాల్‌రెడ్డి మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. గురువారం మహబూబ్‌నగర్ లేదా మాచినేనిపల్లి గ్రామానికి తీసుకురానున్నారు. వేణుగోపాల్‌రెడ్డి ప్రస్తుతం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ డీఎంఈఓగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో, వనపర్తిలో వివిధ హోదాల్లో వైద్యశాఖ ఉద్యోగిగా ఆయన విధులు నిర్వహించారు. వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటిలో కొనసాగుతున్నారు. ఈయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వేణుగోపాల్‌రెడ్డి సోదరుడు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గాదెల రత్నప్రభాకర్‌రెడ్డి మూడేళ్ల క్రితం రోడ్డుప్రమాదంలోనే మృతి చెందారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- నల్లబెల్లం, పటిక స్వాధీనం



తెలకపల్లి: ఎక్సైజ్ అధికారులు బోరబండతండాలో దాడులు చేపట్టినట్లు ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు మండలంలోని బోరబండతండాలో దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన యాకూబ్, పృథ్వీరాజ్ ఓ వాహనంలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా, లింగాల మండలానికి చెందిన శంకర్, పృథ్వీరాజ్ వట్టిపల్లితండాలో సారాతయారు చేసే వారికి సరఫరా చేస్తున్నారు. పక్కా సమాచారంతో విషయం తెలుసుకుని దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీటిని వట్టిపల్లితండాకు చెందిన ప్రతాప్‌నాయక్‌కు సరఫరా చేస్తుండగా వారి వద్ద నుంచి 9 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 400 లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. హైదరాబాద్‌కు చెందిన యాకూబ్, పృథ్వీరాజ్, వాహనానంతో పాటు లింగాలకు చెందిన శంకర్, రవి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శంకర్, రవి పరారైనట్లు తెలిపారు.

టీపీసీసీ అధికార ప్రతినిధులుగా హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అక్తర్



హర్షవర్ధన్‌రెడ్డి



జహీర్ అక్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ అధికార ప్రతినిధులుగా జిల్లాకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అక్తర్‌లు నియమితులయ్యారు. హర్షవర్ధన్‌రెడ్డి గతంలో టీపీసీసీ అధికార ప్రతినిధిగా మూడేళ్ల పాటు పనిచేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, నీళ్ల కోసం పలుసార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. ఓ సారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, రెండుసార్లు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇక జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు జహీర్ అక్తర్ మొదటిసారిగా టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఎన్‌ఎస్‌యూఐలో విద్యార్థి నేతగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జహీర్ కాంగ్రెస్‌లో పలు పదవులు చేపట్టారు. ఎన్‌ఎస్‌యూఐ నవాబ్‌పేట మండల, జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కోఆర్డినేటర్‌గా, డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

క్లుప్తంగా

జయప్రదం చేయండి

నారాయణపేట టౌన్: జిల్లాలోకి అంగన్‌వాడీల రాష్ట్ర జీపు జాతా గురువారం చేరుకుంటుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కన్వీనర్ బాల్‌రాం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జూన్ 16న నుంచి ప్రారంభమైన జీపు జాతా జిల్లా కేంద్రానికి గురువారం ఉదయం 10 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను మద్దూరు, నారాయణపేట, మక్తల్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థినికి సన్మానం

ధన్వాడ: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన చిట్టెం శ్రీచరణి 720 మార్కులకు గాను 624 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 16,357 ర్యాంకు పొంది ఎంబీబీఎస్ ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బుధవారం విద్యార్థినికి శాలువ, పూలమాలతో సన్మానం చేశారు. ఇలాగే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి పేదలకు సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, రఘువేందర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, శకీరప్ప, యూసుఫ్, నర్సిములు, లక్ష్మయ్యగౌడ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

మరికల్: మండల కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌ఐ కాశప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల వారీగా కార్డులను పరిశీలించారు. దుకాణంలో నిల్వ బియ్యం వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై నమోదు చేయాలన్నారు. డీలర్లు బియ్యం అక్రమంగా అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేత

మరికల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తీలేర్ హెచ్‌ఎం అనూరాధకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. దీంతో జిల్లా కేంద్రంలో విద్యా దినోత్సవం పురస్కరించుకొని జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఘన సన్మానం

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో బుధవారం మక్తల్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు అనిల్‌గౌడ్, సుహాసిని, హిమబిందులను కలెక్టర్ కోయ శ్రీహర్ష, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ ప్రశంసాపత్రం అందజేశారు.

విద్యార్థుల ప్రతిభ

ఊట్కూర్: హైదరాబాద్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ గ్రాండ్ ఫినాలే పోటీల్లో మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. చిన్నపొర్ల విద్యార్థులు తయారు చేసిన ప్లాస్టిక్ ఏటీఎం మిషన్ ఐడియా రాష్ట్ర స్థాయికి ఎంపికైందని సైన్స్ అధికారి భాను ప్రకాశ్, గైడ్ శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను, గైడ్ టీచర్లను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అభినందించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మాగనూర్: గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ అన్నారు. బుధవారం ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మండల కేంద్రానికి చెందిన వర్కూర్ సుధాకు మంజురైన నూతన బేకరిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 శాతం సబ్సిడీని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఏపీఎం వనిత, వైస్ ఎంపీపీ తిప్పయ్య, సీసీ గంగధార్, రుక్మిణి, పావని, బాబు, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, ఆనంద్‌గౌడ్, కృష్ణయ్య, సిద్ధప్ప పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

ఊట్కూర్: సైబర్‌నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ అబ్దుల్ కోరారు. బుధవారం పోలీసు కళాజాతా బృందం ఆట, పాట, మాటల ద్వార రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు, సెల్ ఫోన్ వినియోగం తదితర సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో 100 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు లింగం, కల్యాణి, సురేందర్‌గౌడ్, రెక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డుపై అవగాహన సదస్సు

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి, అంత్వార్, చిన్నజట్రం గ్రామాల్లో బుధవారం జన్‌సహస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు, లేబర్‌కార్డుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ గోపినాథ్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో కార్మిక హెల్ప్‌లైన్ ఉపయోగించుకోవాలని, శ్రామిక దోపిడి నుంచి విముక్తి పొందడంపై చైతన్యవంతం కావాలన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 180012011211కు కాల్ చేసి కార్డు ప్రయోజనాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రేణుక, అప్సర్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.


పల్లెర్ల పాఠశాలలో యోగా ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



మక్తల్‌లో సరస్వతి విద్యామందిర్‌లో..


పెద్దచింతకుంటలో యోగా విన్యాసాలు వేస్తున్న విద్యార్థులు


ముశ్రీఫా పాఠశాలలో యోగాలో పాల్గొన్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కోస్గి: కాలంతో పాటు పరిగెడుతున్న నేటి తరం వారు తమ ఆరోగ్యం కోసం శ్రద్ధ చూపకపోవడంతో రోగాల బారిన పడుతున్నారని, నిత్యం ఒక గంట యోగా కోసం కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారవచ్చని వివేకానంద సామాజిక సేవా సంస్థ రాష్ట్ర ప్రచారక్ కృష్ణస్వామి సూచించారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వాకర్స్ అసోసియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త రఘోత్తం తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యోగ శిక్షకులు శ్రీహరి ఆధ్వర్యంలో గ్రామస్తులు యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో జయప్రకాష్, హరినాథ్, బాలరాజు, రాజశేఖర్, బాలయ్య, వెంకట్రాములు, నరేందర్ పాల్గొన్నారు

మరికల్: మండలంలోని మాధవరం, మరికల్, కన్మనూర్, పెద్దచింతకుంట, ఎల్లిగండ్ల, పస్పుల, తీలేర్ తదితర గ్రామాల్లో విద్యార్థులచే యోగాసనాలను వేయించారు.

మక్తల్: మండలంలోని లింగంపల్లి, మాద్వార్‌లో గ్రామస్తులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా అంజనేయరెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మనస్సును తమ ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు ఎలాంటి రోగాలు రాకుండా దోహదపడుతుందన్నారు. మనిషి శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు రోజుకు కనీసం 30నిమిషాలు అయినా యోగా కేటాయించాలని కోరారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో విద్యార్థులను యోగా ఆకారంగా కూర్చొబెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు అంజనేయలు, బాబు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో గ్రామస్తుల చేత బీజేపీ నాయకులు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా బీజేవైం జిల్లా నాయకుడు మజ్జిగ సురేష్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం యోగా డే ను ఆచరించడం శుభ పరిణామమన్నారు. అదే విధంగా కృష్ణా ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కృష్ణా హెచ్‌ఎం నిజాముద్దీన్ పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు.

మద్దూరు: మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ వివరించారు.


మరికల్‌లో యోగా ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



మీర్జాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థుల విన్యాసాలు



సర్జఖాన్‌పేట జెడ్పీ పాఠశాలలో..


ధన్వాడలో..

ఘనంగా సంగీత దినోత్సవ వేడుకలు

నారాయణపేట రూరల్: ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలను ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హంసవాహిని ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ ముఖ్య అతిథిగా హాజరై సరస్వతీమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం కళాకారులను శాలువా, జ్ఞాపికతో సన్మానించి, విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

పేటలో నృత్య శిక్షణ కేంద్రం

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థం పట్టణంలో ఎస్పీబాలు నృత్య సంగీత శిక్షణ కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు.


సంగీత కళాకారులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ గందె అనసూయ

కార్యక్రమంలో చంద్రకాంత్, డాక్టర్ గీత, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్, సంగనర్సింహులు, వసంత్, రామకృష్ణ, టీచర్లు తిరుపతి, నర్సింహులు, ఆనంద్, ఉదయ్, సంగీత, ప్రియాంక పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టం చేయాలి

నారాయణపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం 1977 గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు బొద్దెంపల్లి నర్సింహులు, గౌరవ అధ్యక్షుడు డా. క్యాతన్ రఘునాథ్ డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో కనీసం 10 ఎకరాల స్థలంలో ప్రభుత్వమే గోశాల ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో గోవులను పెంచాలని, చట్ట విరుద్ధంగా నడుస్తున్న గోవధశాలలను తక్షణమే మూసి వేయాలని కోరారు. గోవులను జాతీయ ప్రాణిగా ప్రకటించి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. బక్రీద్ సందర్భంగా గోవులను వధించడం అడ్డుకుంటామని హెచ్చరించారు. గోసంరక్షణ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ గోమాతను పూజించాలని కోరారు. ప్రవీణ్ కుమార్, శ్రావణ్ కుమార్, వెంకటేష్, చేతన్, అర్జున్, రవి, నగేష్ పాలొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏకు గాయాలు

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ద్విచక్ర వాహనం, అశోక్ లేల్యాండ్ వాహనం ఢీకొన్న ఘటనలో వీఆర్‌ఏ తిమ్మప్పకు గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అశోక్ లేల్యాండ్ వాహనం వెనక నుంచి వీఆర్‌ఏ తిమ్మప్ప ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. వీఆర్‌ఏకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

గోవా మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టులో ఎక్సైజ్ పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ప్రైవేట్ బస్సులో ఏడు బాటిళ్ల గోవా మద్యం పట్టుబడిందని ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని రిమాండ్‌కు పంపిస్తామన్నారు. ఎక్సైజ్ పోలీసులు మల్లన్‌గౌడ్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి

కృష్ణా: పోలీసులు ఒకరికొకరు సమన్వయంతో ముందుకెళ్లాలని సీఐ సీతయ్య అన్నారు. బుధవారం శక్తినగర్ పోలీస్‌స్టేషన్‌లో కృష్ణా, మాగనూరు ఎస్‌ఐలు విజయభాస్కర్, మల్లేష్‌తో పాటు సైదపూర్ పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల సంబంధించిన కేసులతో నిందితులను త్వరగా గుర్తించేందుకు ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు.

హైకోర్టు ఆదేశాలతో నిలిచిన పనులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సరాఫ్‌బజార్‌లో బంగారం, బట్టల కొనుగోలుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో మూత్రశాలల నిర్మాణం చేపడుతున్నారు. అయితే సమీపంలోనే దేవాదాయశాఖకు చెందిన ఆలయం ఉండటంతో పూజారి బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో హైకోర్టులో కేసు వేశారు. విచారించిన న్యాయస్థానం స్టే ఇచ్చింది. దీంతో పనులు ఆగిపోయాయి.


వినతిపత్రం అందజేస్తున్న రైతుల సంఘం నాయికులు

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చాకలోన్‌పల్లి, యల్సన్‌పల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అర్హుల జాబితాను సిద్ధం చేసి ఇళ్ల మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 23న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరుణ్, గోవింద్, లాలప్ప, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

మక్తల్: రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందజేయాలని కోరుతూ ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు భగవంతు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ సలీం, భుట్టో, గోపాల్ ఉన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలు


ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


కొల్లంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని యాద్గీర్ రోడ్డులో గల ఎంబీ చర్చిలో ఎమ్మెల్యే ఎస్‌ఆర్ రెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం అనంతసేన ఆలయంలో నియోజకవర్గానికి చెందిన ఆలయాలకు ధూప దీప నైవేద్యం మంజూరైన పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. రాత్రి మండలంలోని కొల్లంపల్లిలో ఖతల్‌హుసెన్సీ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తాం

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయశంకర్ 12వ వర్ధంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గందె అనసూయ, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, నాయకులు విజయ్‌సాగర్, బండి శివరాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కోట్ల రాజవర్ధన్‌రెడ్డి తదితరలు ఉన్నారు. ఎక్లాస్‌పూర్ ఆలయంలో..

నారాయణపేట రూరల్: దేవాదాయశాఖ పరిధిలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి ఆలయంలో బుధవారం ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజలి, సర్పంచ్ జమునాబాయి, ఎంపీటీసీ రాంరెడ్డి, కోట్ల జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా పట్టణంలో పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని యాగం నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలకు ఎంపికైన వారికి జారీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, ఆలయ చైర్మన్ బీమాచారీ, ఎంపీపీ వనజ, తిప్పయ్యస్వామి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కలెక్టర్‌కు వినతి

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ఉన్న తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టలని కోరుతూ బుధవారం సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌ముదిరాజ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం లేనందున పక్కనే ఉన్న గుట్టల నుంచి వన్య ప్రాణులు, విషసర్పాలు పాఠశాల భవనం లోపలికి ప్రవేశిస్తున్నాయని, ఇప్పటికే రెండు సార్లు పులులు కనిపించాయన్నారు. పాఠశాల ఎదుట ఉన్న రైతువేదికకు పెన్సింగ్ చేసిన అధికారులు పాఠశాల భవనానికి ప్రహరీ నిర్మించకపోడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వెంటనే అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో చంటి, గోవింద్, కనకప్ప తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం పోరాడాలి

మరికల్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం యువత కదిలి రావాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు హరీష్, అంజనేయులు, శేఖర్, రామకృష్ణ అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ దశాబ్దాల నుంచి మరికల్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా.. స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లేదన్నారు. ఇక్కడి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడం, వారి అక్రమ ఆస్తులను పెంచుకోవడంపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థులకు ఉన్నత చదువు అందించాలన్న ధ్యాస లేదని విమర్శించారు. వాట్సప్‌లో, ఫేస్‌బుక్‌లో మేసేజ్‌లు పెడితే కళాశాల రాదని, యువత కలిసి వస్తే ఇక్కడి పాలకులను, అధికారులను నిలదీసి గ్రామంలో తిరగకుండా చేస్తే కళాశాల సాధ్యమవుతుందన్నారు.

మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల అవస్థలు


తాళంవేసి ఉన్న తాళంకేరి పాఠశాల


బైరంపల్లి పాఠశాలలో దిగులుగా కూర్చున్న విద్యార్థులు

మాగనూర్: మండలంలోని బైరంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డించకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. పాఠశాలలు పున:ప్రారంభం అయి తొమ్మిది రోజులు గడుస్తున్న కనీసం మధ్యాహ్నం భోజనం పెట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాలేదు. విద్య బోధన చేసేవారు లేక తరగతి గదిలో ఖాళీగా కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న క్లస్టర్ హెడ్మాస్టర్ వెంకటయ్య పాఠశాలకు చేరుకుని అక్కడి పరిస్థితులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయుడు సెలవులో ఉన్నాడని విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. సీఆర్పి ఎల్లాగౌడ్‌కు ఉపాధ్యాయుడు వాట్సాప్ ద్వారా సెలవు అడిగి తీసుకున్నాడని పేర్కొన్నాడు. సీఆర్పీ బాధ్యతరహితంగా వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అస్తవ్యస్తంగా నేరడగం కాంప్లెక్సు పరిధి..

అయితే ఇదిలా ఉండగా నేరడగం కాంప్లెక్స్ పరిధిలోని కొన్ని పాఠశాలల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. వర్కూర్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థికి స్కూటర్ ఇచ్చి పనుల కోసం బయటకు పంపిస్తున్నాడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైన ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. తళంకేరి, గురువలింగంపల్లి పాఠశాలలు అయితే ఏకంగా పాఠశాల సమయం కంటే గంట ముందే పాఠశాలకు తాళం వేసి వెళ్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కాంప్లెక్స్‌హెచ్‌ఎం వెంకటయ్య

కళ్లు తిరుగుతున్నాయి..



పాఠశాలలో అన్నం పెట్టడం లేదు. ప్రతి రోజు పాఠశాలకు ఉదయం వచ్చి మధ్యాహ్నం తినకుండానే పాఠాలు విని ఇంటికి తిరిగి వెళ్తున్నాం. ఇంటికి తాళం వేసి అమ్మ, నాన్నలు కూలికి వెళ్తారు. మధ్యాహ్నం ఉపవాసం ఉంటున్నాం. దీంతో మాకు కళ్ళు తిరుగుతున్నాయి.

– అశ్విని, 5వ తరగతి విద్యార్థి బైరంపల్లి

చర్యలు తీసుకుంటాం..



బైరంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని సమాచారం రాలేదు. బాధ్యులైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటాం. వెంటనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటయ్య, కాంప్లెక్స్, హెచ్‌ఎం, నేరడగం

నకిలీ విత్తనాలు అరికట్టాలి


ధన్వాడలో తహసీల్దార్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ధన్వాడ: వానాకాలం సీజన్లో రైతాంగ ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కృష్ణయ్య మాట్లాడుతూ దళారులు వ్యాపారులుగా మారి గ్రామాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తూ మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలకు సంబంధించి 15 నుంచి 20శాతం వరకు రీసైక్లింగ్ చేసిన నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం మండిపడ్డారు. కార్యక్రమంలో టీరప్ప, రాజు, రాములు, తిరుమలేష్, బాలప్ప, వెంకటేష్, జోగప్ప, కతల్‌పాషా, శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలి

మరికల్: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం నాయకులు రాజు అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బుధవారం తహసీల్దార్ రాంకోటికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు.

ఘనంగా కోట మశమ్మ జాతర

ఊట్కూర్: మండలంలోని కోట మశమ్మ జాతర సందర్భంగా బుధవారం మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యువకులు రెట్టపట్ల పోటీలను నిర్వహించారు. విజేతగా నిలిచిన కర్ణాటక తుర్కల్ దొడ్డి గ్రామానికి చెందిన హన్మంతుకు ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు కుర్వ ఆశప్ప, గోవిందప్ప, హన్మంతు, బల్‌రాం, పోలప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 5 నిర్మాణాలకు ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత 'ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డు'లను లండన్‌లో అందుకున్న ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఆ అవార్డులను కేసీఆర్‌కు అందజేశారు.

అనస్తీషియాలజిస్ట్ విభావరి ఘనత

ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియా గౌరవ కార్యదర్శిగా ఎన్నిక



బంజారాహిల్స్ (హైదరాబాద్): బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియాలజిస్ట్, ఇంటెన్సివ్ వైద్య నిపుణురాలు డాక్టర్ విభావరి నాయక్ ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియాకు గౌరవ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మొదటిసారి భారతీయ వైద్యురాలు ఈ పదవికి ఎన్నికయ్యారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన మూడు రోజుల కాన్ఫరెన్స్‌లో ఆమెను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు ఆమె ఈ పదవికి ప్రాతినిధ్యం వహిస్తారు. 2010 నుంచి బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఆమె పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే ప్రతి ఒక్కరితో పనిచేసే గొప్ప అవకాశాన్ని పొందానని ఆనందం వ్యక్తం చేశారు.

పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వాణిజ్య పన్నుల గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ (టీసీటీజీవోఏ) రాష్ట్ర అధ్యక్షునిగా వి.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా మురళీమోహన్, సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.దేవేందర్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్.భాస్కర్, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.రామలక్ష్మయ్య, కోశాధికారిగా ఎస్.గిరిధర్, జాయింట్ సెక్రటరీలుగా బి.రాజు, డి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కందిమళ్ల సుధీర్‌రెడ్డి, బీమ్లా, నరేశ్‌రెడ్డి, విజయ్, మురళి ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు పదవుల్లో కొనసాగనున్నారు.

హస్తినలో బంగారు బోనం

ఘనంగా లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాలు ● బంగారు బోనాలు సమర్పించిన బండారు దత్తాత్రేయ, బీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ పాతబస్తీ లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బుధవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు బోనం సమర్పించారు. అలాగే బీఆర్‌ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ నేత మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ, పట్టణ, వ్యవసాయం, ఐటీ.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వకపోయినా చెరువుల పునరుద్ధరణ చేశారని, ప్రాజెక్టులను నిర్మించారని



బంగారు బోనం తీసుకెళ్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఆదరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ అభివృద్ధి జరుగుతోందని, తెలంగాణ పాలనపై పక్క రాష్ట్రాల్లో చర్చ జరుగుతోందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరో ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాలు జరుపుకోవడం సంతోషకరమన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీలను అడ్డుకున్న శేజల్

ఇదిలా ఉండగా బోనాల కార్యక్రమంలో పాల్గొనడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ ఎంపీలు వెంకటేశ్ నేత, సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలకు నిరసన సెగ తగిలింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భవన్ వేదికగా గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న శేజల్, ఎంపీలను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఎంపీల వాహనానికి అడ్డుగా నిలిచి శేజల్, ఆరిజన్ డైరీ నిర్వాహకుడు ఆదినారాయణ నిరసన వ్యక్తం చేయగా.. ఎంపీ సురేశ్‌రెడ్డి కారు దిగివచ్చి, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ఏజీ బీఎస్ ప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తులు

ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావుకు 'బూటి' అవార్డు

సాక్షి, హైదరాబాద్: శాస్త్ర సంబంధిత సమాచారాన్ని సామాన్యుల చెంతకు చేర్చేందుకు విశేష కృషి చేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) శాస్త్రవేత్త, న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు.. ప్రతిష్ఠాత్మక బూటి ఫౌండేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్లాస్మా ఫిజిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ బిమలా బూటి ఏర్పాటు చేసిన బూటి ఫౌండేషన్ అవార్డును గుజరాత్ సైన్స్ అకాడమీ అందజేస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు భవిష్యత్తుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేసిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.



గోవా రాజ్‌భవన్‌లో యోగా దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు చేయండి

మళ్లీ నిర్వహణకు హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడం అక్రమాలకు తావిచ్చేలా ఉందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ప్రభుత్వాన్ని, టీఎస్‌పీఎస్సీని ఆదేశించాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు బి.ప్రశాంత్, బండి ప్రశాంత్, జి.హరికృష్ణ పిటిషన్ వేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రతివాదిగా పేర్కొన్నారు. హాల్ టికెట్ నంబర్, ఫొటో లేకుండానే ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని.. ఇది అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం ఇచ్చేలా ఉందని స్పష్టం చేశారు. ఒకసారి లీకై మళ్లీ నిర్వహిస్తున్న గ్రూప్–1 విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవలసిన కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 13న టీఎస్‌పీఎస్సీకి వినతి పత్రం కూడా నిచ్చినా స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. న్యాయవాది బి.నర్సింగ్ ఫైల్ చేసిన ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ మాధవిదేవి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

తెలంగాణ సాహిత్యాన్ని కాపాడుకోవాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఘనంగా ప్రారంభమైన సాహితీ సభలు
- ఆచార్య ఎస్.గోపికి జయశంకర్ పురస్కారం ప్రదానం



ఆచార్య ఎస్.గోపీకి స్వర్ణకంకణం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణ సాహిత్య వికాసాన్ని, సాహితీ పుత్రులను నిరంతరం స్మరించుకోవడంతో పాటు తెలుగు సాహిత్యాన్ని మరింత పరిపుష్టం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన తెలంగాణ సాహిత్య సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య ఎస్.గోపికి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తొలి విశిష్ట సాహితీ పురస్కారం –2023ను కవిత ప్రదానం చేసి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకోవడం ఎంత ముఖ్యమో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమన్న నినాదంతో ఉద్యమం చేశామన్నారు. తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ వారు మరింత పరిపుష్టం చేయాలన్న ఉద్దేశంతో భారత జాగృతి ఆధ్వర్యంలో సాహితీ సభలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఇకపై ఏటా తెలంగాణ సాహిత్య సభలు జరుపుతామని ప్రకటించారు. రెండురోజుల పాటు జరగనున్న సాహిత్య సభల్లో పలు అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ చర్చలన్నింటిని గ్రంథస్తం చేస్తామని చెప్పారు. కాగా, సాహితీ ప్రేమికులుగా హిందీభాషలో ఉన్న సాహిత్యాన్ని ఆరాధిస్తామని, కానీ ఇదే మాట్లాడాలని రూల్స్ పెడితే మాత్రం తప్పకుండా రూల్స్ బ్రేక్ చేస్తామని పేర్కొన్నారు. దేశంలో తెలంగాణ మినహా ఏ రాష్ట్రంలో కూడా వేతనాలు చెల్లిస్తూ కళాకారులను గౌరవించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపీకి విశిష్ట సాహిత్య పురస్కారం కింద స్వర్ణ కంకణంతో పాటు రూ.1,01,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిని సిద్దారెడ్డి, డాక్టర్ గోరటి వెంకన్న, డాక్టర్ తిరునగరి దేవకీ దేవి, డాక్టర్ గోగు శ్యామల, డాక్టర్ నాళేశ్వరం శంకర్, జాగృతి కార్యకర్తలతో పాటు పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న దివ్యాంగులు

కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్
- కన్హా శాంతివనంలో దివ్యాంగుల సామూహిక యోగా
- మూడు రికార్డులు సొంతం

నందిగామ: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 16 రాష్ట్రాలకు చెందిన 3వేల మంది దివ్యాంగులు సామూహిక యోగా చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీరేంద్ర కుమార్ యోగాసనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరు దినచర్యలో భాగంగా యోగా చేయాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సామూహికంగా భారీ ఎత్తున పాల్గొని యోగా చేసినందుకుగాను అంతర్జాతీయ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నారు. అనంతరం దృష్టి, వినికిడి, అంగవైకల్యం కలిగిన సుమారు 200 మందికి సహాయ ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐఈపీఐడీ డైరెక్టర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన రంగం సుస్థిరాభివృద్ధికి కీలకమెట్టు

జడ్చర్ల టౌన్: దేశం సుస్థిరాభివృద్ధి చెందాలన్న పరిశోధన రంగంలో చేసే పరిశోధనలు కీలకమెట్టని ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నిర్మలాబాబురావు అన్నారు. బుధవారం పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జీవశాస్త్రంలో పరిశోధనలు, అవకాశాలు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు పరిశోధనల వైపు ఆసక్తి కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. పోటీ ప్రపంచంలో వివిధ రంగాల్లో ఉండే అవకాశాలతోపాటు పాటుగా పరిశోధనారంగం యొక్క ఆవశ్యకత వివరించారు. విద్యార్థులు డిగ్రీ స్థాయి నుంచే పరిశోధన వైపు మొగ్గుచూపి ఆదిశగా ప్రయాణం చేసినప్పుడు ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపించటానికి వీలు కలుగుతుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగంలోని ముగ్గురు పరిశోధన విద్యార్థులు స్థానిక కళాశాలలో పరిశోధనలు చేశారన్నారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్, తెలంగాణ స్టేట్ హెర్బేరియం సెంటర్ పరిశోధనలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, అధ్యాపకులు శ్రీనివాసులు, సదాశివయ్య, డా.శంకర్, రామకృష్ణ, ప్రభాకర్‌గౌడ్, లత, భార్గవి, పరిశోధక విద్యార్థులు రమాదేవి, రాహుల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక దినోత్సవ కానుక

- ధూప, దీప, నైవేద్య పథకం నియామకపత్రాల అందజేత

జోగుళాంబ శక్తిపీఠం: ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవ కానుక ఆయా జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల అర్చకులకు ధూప, దీప, నైవేద్య పథకం నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, దేవదాయశాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ పురేందర్, ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ధూప, దీప, నైవేద్య పథకం సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆనంద్ శర్మ అర్హులైన 9 మంది అర్చకులకు నియామకపత్రాలు అందజేశారు. అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఎమ్మెల్యే అబ్రహం, కలెక్టర్ వల్లూరి క్రాంతి, నోడల్ అధికారి పురేందర్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు నరేంద్రాచార్యులు 20 మంది అర్హులైన అర్చకులకు నియామకపత్రాలు అందజేశారు.



మక్తల్‌లో నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట ఉమామహేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, దేవదాయశాఖ అధికారులు జయపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, మద్దిమడుగు చైర్మన్ విష్ణుమూర్తి 33 మంది అర్హులైన అర్చకులకు ధూప, దీప, నైవేద్యం పథకం నియామకపత్రాలను అందజేశారు. పాలెం దేవస్థానంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి, ఆలయ ఈఓ రంగారావు అర్చకులకు అందజేశారు.

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్ న్యూగంజ్ నరసింహ స్వామి ఆలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు 33 మంది అర్హులకు అందజేశారు. ఇదిలా ఉండగా జడ్చర్ల, దేవరకద్ర, కల్వకుర్తి, కొడంగల్‌లో నియామకపత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి జిల్లా కేంద్రంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ తేజాస్‌నందలాల్ పవర్, దేవదాయశాఖ అధికారి శేఖర్‌రెడ్డి, వనపర్తి డీడీఎన్ఎస్ అర్చక సంఘం అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంత్ 44 మంది అర్చకులకు, కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ రంగారావు 19 మంది అర్చకులకు నియామకపత్రాలు అందజేశారు.

నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఈఓ శ్యాంసుందరాచారి పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో 38 మంది అర్చకులకు అందజేశారు. ఇదిలా ఉండగా నారాయణపేటలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి 38 మందికి, కొడంగల్‌లో 13 మందికి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నియామకపత్రాలను అందజేశారు. కాగా గ్రామీణ ప్రాంతాలలో ఎంపికై న ఈ ఆలయాలకు ప్రతి నెల రూ.6వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. మరో మూడు నెలల్లో ఈ వేతనం రూ.10వేలకు ప్రభుత్వం పెంచనుంది.

హెచ్‌సీఏ లీగ్‌లో పాలమూరు భారీ విజయం

- 400 పరుగుల తేడాతో తెలంగాణ క్రికెట్ క్లబ్‌పై గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ బీ–డివిజన్ టూడే లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు భారీ విజయాన్ని అందుకుంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు 400 పరుగుల తేడాతో తెలంగాణ క్రికెట్ క్లబ్ జట్టుపై భారీ విజయం అందుకుంది. తొలిరోజు జిల్లా జట్టు 8 వికెట్లకు 530 పరుగులు చేసింది. బుధవారం రెండో రోజు తెలంగాణ క్రికెట్ క్లబ్ బ్యాటింగ్ చేపట్టగా జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 36.3 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు మహ్మద్ షాదాబ్ 4, హర్షవర్ధన్3, ఆదిత్యరెడ్డి 2 వికెట్లు తీశారు.

ఎండీసీఏ అభినందనలు

హెచ్‌సీఏ టూడేలీగ్ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. మ్యాచ్‌లో గెలుపొందడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో టూడేలీగ్‌లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ప్రైడ్ కన్‌స్ట్రక్షన్ రవీందర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు క్రీడాదుస్తులు అందజేశారు.



జిల్లా క్రికెట్‌జట్టుతో రాజశేఖర్ తదితరులు

మహనీయులు కులమతాలకు అతీతులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహనీయులు కులమతాలకు అతీతులని ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్ట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనకు తన పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సహకార చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చి బడుగు, బలహీన వర్గాల బలోపేతానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. విగ్రహాల ఏర్పాటులోనూ కొందరు వ్యక్తులు వివాదం సృష్టించాలని చూడటం సరికాదన్నారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ విలువ ఇస్తుందన్నారు. అనంతరం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని పద్మావతీకాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నర్సింహ, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు రోజ, కట్టా రవికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

దేదీప్యంగా దశాబ్ది ఉత్సవాలు

- అలంపూర్ కేంద్రంగా ముగిసిన ఆధ్యాత్మికోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: ప్రభుత్వంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాలు అలంపూర్ క్షేత్రానికి ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. ఈ నెల 2వ తేదీ జోగుళాంబ ఆలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన దశాబ్ది ఉత్సవాలు బుధవారం ఆధ్యాత్మికోత్సవంతో ముగిశాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే అబ్రహం, జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, ఆలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పుణ్యహవాచనం, మహన్యస రుద్రాభిషేకం, పల్లకీ సేవ, లక్షపుష్పార్చన, మహానివేదన, సాయంత్రం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శివతాండవం భరత నాట్యం, కూచిపుడి నృత్యాలు చేశారు.



జోగుళాంబ ఆలయంలో లక్ష పుష్పార్చనలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

అన్నదాన సత్రానికి సహకరించండి: ఆలయ చైర్మన్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేసేందుకు సత్రం నిర్మాణానికి ఎమ్మెల్యే సహకరించి, ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిధుల విషయంలో తాను అనేక పర్యాయాలు సీఎం కేసీఆర్‌తో మాట్లాడానని, కేంద్ర పురాతత్వ శాఖ నిబంధనలతో ఇక్కడ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వడం వీలు పడటం లేదని తెలిపారు. సమస్యలను త్వరలోనే అధిగమించి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. అనంతరం అలంపూర్ నియోజక వర్గానికి కొత్తగా మంజూరైన 20 డీడీఎన్ఎస్ నియామకపత్రాలను అందజేశారు. ఇంతలో ఒక్క సారిగా జోరుగా వర్షం పడటంతో సమావేశాన్ని ముగించారు.



శివతాండవం చేస్తున్న కళాకారులు

కుష్టు రహిత సమాజంగా మారాలి

దేవరకద్ర: కుష్టు రహిత సమాజంగా మార్చడానికి అందరూ సమష్టిగా పనిచేయాలని లెప్రసీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాధి విషయంలో తీసుకుంటున్న చర్యల గురించి, వ్యాధి సోకిన వారికి చేస్తున్న చికిత్సలపై ఆరాతీశారు. వైద్య సిబ్బందితో కుష్టు సర్వేలు చేయించి రూపొందించిన నివేదికలను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుష్టును ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించాలన్నారు. సమావేశంలో డాక్టర్ జరినాబాను, మెడికల్ ఆఫీసర్ సుష్మిత, సీహెచ్ఓ పరంకుశం, డీపీఎంలు హన్మంతరావు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జోషఫ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ జాన్‌బాబు

Published and Printed by V.Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey No 520, Amistapur Village Bhoothpur mandal, Mahabubnagar Dist - 509 382. TG. Printed at Jagati Publications Limited Survey No 520, Amistapur Village, Bhoothpur mandal, Mahabubnagar Dist - 509 382. TG.; Editor: V.Murali,(Responsible for selection of News under the PRB Act) Phone No. 08542236311, Fax No.236344 RNI Regn No. TELTEL/2008/23809.